
# భారత హెడ్‌కోచ్‌గా గంభీర్?



ముంబై: భారత క్రికెట్ జట్టు మాజీ ఆటగాడు, ఐపీఎల్-17లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మెంటార్‌గా వ్యవహరిస్తున్న గౌతం గంభీర్ టీమ్‌ఇండియాకు తదుపరి హెడ్‌కోచ్‌గా రాబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సైతం ద్రవిడ్ వారసత్వాన్ని గౌతీకి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్టు బోర్డు వర్గాల సమాచారం. ఈ మేరకు బీసీసీఐ ప్రతినిధి ఒకరు.. ఇదే విషయమై గంభీర్‌తో చర్చించి అతడిని కోచ్ పదవికి దరఖాస్తు చేసే విధంగా మంతనాలు జరిపినట్టు విశ్వసనీయ వర్గాల వినికిడి. 'మెన్ ఇన్ బ్లూ'కు హెడ్‌కోచ్ రేసులో లక్ష్మణ్, ఫ్లెమింగ్, లాంగర్, పాంటింగ్, నెహ్రా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. భారత్ గెలిచిన రెండు ఐసీసీ ట్రోఫీ (2007, 2011)లలో భాగమైన గంభీర్‌కు ఇప్పటిదాకా కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. ఐపీఎల్‌లో అతడు 2022, 2023 సీజన్లలో లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా వ్యవహరించి ఈ సీజన్లో ఆ బాధ్యతను కేకేఆర్‌కు నిర్వర్తిస్తున్నాడు. హెడ్‌కోచ్ పదవికి అప్లై చేసేందుకు ఈనెల 27 ఆఖరితేదీ కాగా అప్పట్లోగా గౌతీ ఏ నిర్ణయం తీసుకుంటాడనేది ఆసక్తికరంగా మారింది.

# సెమీస్‌కు సాత్విక్-చిరాగ్

**మహిళల విభాగంలో అశ్విని-తనీషా**



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బ్యాంకాక్ వేదికగా శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో భారత జోడీ 21-17, 21-14 తేడాతో మలేషియా ద్వయం జునైది అరిఫ్-రాయ్ కింగ్ యప్‌ను 38 నిమిషాల్లోనే మట్టికరిపించి సెమీస్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో అశ్విని-తనీషా జంట 21-15, 21-23, 21-19 తేడాతో కొరియన్ ద్వయం షిన్ సెయుంగ్ చన్-లి యు లిమ్‌ను ఓడించింది. సంచలన ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ ఆటగాడు మిరాబా లువాంగ్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. క్వార్టర్స్‌లో లువాంగ్ 12-21, 5-21తో కున్లావత్ వితిద్సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పరాభవం పాలయ్యాడు.

# ముంబైకి నిరాశే



పూరన్ (75)

**పూరన్ ఊచకోతతో లక్నోకు ఊరట విజయం**

**రోహిత్, నమన్ మెరుపులు వృథా**

**పదో స్థానంతో సీజన్‌ను ముగించిన హార్దిక్ సేన**

**ఐపీఎల్-17లో కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్యా సారథ్యంలో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ సీజన్‌ను ఓటమితో ఆరంభించి ఓటమితోనే ముగించింది. ముంబై వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో బౌలింగ్‌తో పాటు మిడిలార్డర్ వైఫల్యంతో పదో ఓటమిని మూటగట్టుకుంది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నికోలస్ పూరన్ ఊచకోతతో లక్నోకు ఓదార్పు విజయం దక్కింది. ఆరంభంలో రోహిత్ శర్మ, ఆఖర్లో నమన్ ధీర్ మెరుపులే వాంఖడేలో ముంబై అభిమానులకు ఊరటనిచ్చాయి.**

ముంబై: ఐపీఎల్-17 సీజన్‌ను ఓటమితో మొదలుపెట్టిన ముంబై ఇండియన్స్.. అపజయంతోనే ముగించింది. సొంత మైదానం వాంఖడేలో లక్నో సూపర్ జెయింట్స్‌తో తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడిన హార్దిక్ సేన.. 215 పరుగులను ఛేదించే క్రమంలో 196కే పరిమితమై 18 రన్స్ తేడాతో పరాభవాన్ని మూటగట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' నికోలస్ పూరన్ (29 బంతుల్లో 75, 5 ఫోర్లు, 8 సిక్సర్లు) ప్రత్యర్థి బౌలర్లపై దండెత్తడంతో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్ (41 బంతుల్లో 55, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. ఛేదనలో ముంబైకి రోహిత్ శర్మ (38 బంతుల్లో 68, 10 ఫోర్లు, 3 సిక్సర్లు) అదిరిపోయే ఆరంభమిచ్చినా మిడిలార్డర్ చేతులెత్తేశారు. ఆఖర్లో నమన్ ధీర్(28 బంతుల్లో 62 నాటౌట్, 4ఫోర్లు,5 సిక్స్‌లు) పోరాడినా ఆ జట్టు 196/6 వద్దే ఆగిపోయింది.

**నెమ్మదిగా మొదలై..**

లక్నో ఇన్నింగ్స్ మూడో బంతికే పడిక్కల్‌ను తుషారా డకౌట్ చేశాడు. స్టోయినిస్ (28) ఐదు బౌండరీలతో దూకుడు కనబరిచినా చావ్లా 6వ ఓవర్లో వికెట్ల ముందు దొరికిపోయాడు. చావ్లా ఓవర్లోనే రెండు భారీ సిక్సర్లు కొట్టిన రాహుల్.. తర్వాత నెమ్మదించాడు. స్టోయినిస్ స్థానంలో వచ్చిన దీపక్ హుడా (11) మళ్లీ చేతులెత్తేశాడు. 10 ఓవర్లకు లక్నో స్కోరు 69/3గా ఉంది.

**పూరన్ రాకతో..**

నెమ్మదిగా సాగుతున్న లక్నో స్కోరుబోర్డు పూరన్ రాకతో బుల్లెట్ వేగాన్ని అందుకుంది. కంబోజ్ బౌలింగ్‌లో సిక్స్‌తో పరుగుల ఖాతా తెరిచిన ఈ విండీస్ వీరుడు.. తర్వాత ముంబై బౌలర్లను ఊచకోత కోశాడు. కంబోజ్ 13వ ఓవర్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 22 పరుగులు రాబట్టిన అతడు.. అర్జున్ టెండూల్కర్ 15వ ఓవర్లో రెండు సిక్సర్లతో 19 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేశాడు. మరో ఎండ్‌లో రాహుల్ అతడికి పూర్తి సహకారం అందిస్తూనే ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడే క్రమంలో ఈ ఇద్దరూ నిష్క్రమించినా ఆఖర్లో బదోని (22 నాటౌట్) లక్నో స్కోరును 210 మార్కు దాటించాడు. ఆఖరి 10 ఓవర్లలో లక్నో ఏకంగా 145 పరుగులు రాబట్టడం విశేషం.

**రోహిత్, నమన్ బాదినా..**

కొండంత స్కోరును కరిగించే క్రమంలో ముంబై కూడా ఆది నుంచే లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన రోహిత్.. హెన్రీ రెండో ఓవర్లో మిడ్ వికెట్, లాంగాఫ్ మీదుగా భారీ సిక్సర్లతో వాంఖడేను ఉర్రూతలూగించాడు. నవీన్, మోహ్సిన్ ఓవర్లలో బౌండరీలతో విరుచుకుపడ్డ అతడు.. 28 బంతుల్లోనే 50 పరుగులు పూర్తిచేశాడు. రోహిత్‌కు అండగా నిలిచిన బ్రెవిస్ (23)ను ఔట్ చేసిన నవీన్ 88 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించడంతో ముంబై కుదుపునకు లోనైంది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అవగా రోహిత్‌ను బిష్ణోయ్ ఔట్ చేసి లక్నోను పోటీలోకి తెచ్చాడు. హార్దిక్ పాండ్యా (16), నేహల్ వధేరా(1) విఫలమయ్యారు. ఆఖర్లో నమన్ ధీర్ మెరుపులతో లక్నోను భయపెట్టినా ముంబైని విజయతీరాలకు చేర్చలేకపోయాడు.

**సంక్షిప్త స్కోర్లు**

లక్నో: 20 ఓవర్లలో 214/6 (పూరన్ 75, రాహుల్ 55, తుషారా 3/28, చావ్లా 3/29). ముంబై: 20 ఓవర్లలో 196/6 (రోహిత్ శర్మ 68, నమన్ 62 నాటౌట్, బిష్ణోయ్ 2/37, నవీన్ 2/50)

**పాయింట్ల పట్టిక**

| జ | ఆ | గె | ఓ | ఫ.తే. | ర | పా |
|---|---|---|---|---|---|---|
| కోల్‌కతా ✓ | 13 | 9 | 3 | 1 | 1.42 | 19 |
| రాజస్థాన్ ✓ | 13 | 8 | 5 | | 0.27 | 16 |
| హైదరాబాద్ ✓ | 13 | 7 | 5 | 1 | 0.40 | 15 |
| చెన్నై | 13 | 7 | 6 | | 0.52 | 14 |
| ఢిల్లీ | 14 | 7 | 7 | | -0.37 | 14 |
| లక్నో | 14 | 7 | 7 | | -0.66 | 14 |
| బెంగళూరు | 13 | 6 | 7 | | 0.38 | 12 |
| గుజరాత్ X | 14 | 5 | 7 | 2 | -1.06 | 12 |
| పంజాబ్ X | 13 | 5 | 8 | | -0.34 | 10 |
| ముంబై X | 14 | 4 | 10 | | -0.31 | 8 |


నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు ఫ.తే. : ఫలితం తేలనివి.



## సెమీస్‌లోనే ముగిసిన బాక్సర్ల పోరు

అస్తానా: ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నీలో నలుగురు భారత పురుష బాక్సర్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన వేర్వేరు కేటగిరీల సెమీస్ బౌట్‌లలో.. గౌరవ్ చౌహాన్ (92 కిలోలు), యిఫాబా సింగ్ (48 కిలోలు), అభిషేక్ (67 కిలోలు), విశాల్ (86 కిలోలు) చతికిలపడ్డారు. ఈ నలుగురూ కజకిస్థాన్ బాక్సర్ల చేతిలో ఓడి కాంస్యాలతో సరిపెట్టుకున్నారు. మహిళల విభాగంలో ఫైనల్ చేరిన నిఖత్ జరీన్, మీనాక్షి, అనామిక, మనీషా శనివారం స్వర్ణం కోసం బరిలోకి దిగనున్నారు.

## పర్వీన్‌పై నిషేధం



ఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో కోటా దక్కించుకున్న భారత యువ బాక్సర్ పర్వీన్ హుడాపై వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) 22 నెలల నిషేధం విధించింది. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి మధ్యకాలంలో డోప్ టెస్టులలో భాగంగా తన ఆచూకీని తెలియజేయనందుకు గాను వాడా ఆమెపై చర్యలకు ఉపక్రమించింది. రిజిస్టర్ టెస్టింగ్ పూల్ (ఆర్‌టీపీ)లో భాగంగా అథ్లెట్లు ప్రతి త్రైమాసికానికి తాము ఎక్కడున్నామన్నది సంబంధిత అధికారులకు సమాచారమివ్వాలి. వాడా నిబంధనల ప్రకారం 12 నెలల వ్యవధిలో మూడుసార్లు విఫలమైతే వారు నిబంధనలను ఉల్లంఘించినట్టుగా పరిగణిస్తారు. పర్వీన్‌పై నిషేధంతో 57 కిలోల విభాగంలో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) కొత్త ట్రయల్స్ నిర్వహించనుంది.

# మళ్లీ వాళ్లిద్దరే

**ఇటాలియన్ ఓపెన్‌లో స్వియాటెక్, సబలెంక అమీతుమీ**



రోమ్: మహిళల టెన్నిస్ సూపర్ స్టార్లుగా వెలుగొందుతున్న టాప్ సీడ్స్ ఇగా స్వియాటెక్ (పోలండ్), అరీనా సబలెంక (బెలారస్) రెండు వారాల తర్వాత మరోమారు మట్టికోర్టుపై అమీతుమీ తేల్చుకోనున్నారు. ఇటీవలే మ్యాడ్రిడ్ ఓపెన్ ఫైనల్‌లో తలపడ్డ ఈ ఇద్దరూ తాజాగా రోమ్ వేదికగా జరుగుతున్న ఇటాలియన్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకొచ్చారు. మహిళల సెమీస్‌లో రెండో సీడ్ సబలెంక 7-5, 6-2 తేడాతో డానియల్ కొలిన్స్(అమెరికా)ను ఓడించి తుదిపోరుకు అర్హత సాధించింది. అంతకుముందే స్వియాటెక్ 6-4, 6-3తో కోకో గాఫ్ (అమెరికా)ను ఓడించి ఫైనల్స్‌కు చేరింది. హోరాహోరీగా సాగిన మ్యాడ్రిడ్ ఓపెన్‌లో స్వియాటెక్‌నే విజయం వరించింది.

# ఒలింపిక్స్‌కు మమ్మల్నే పంపిస్తారా?

**పారిస్ బెర్తు ఖాయం చేసుకున్నా వీడని సందిగ్ధత • డబ్ల్యూఎఫ్ఐని వేడుకుంటున్న రెజ్లర్లు • మళ్లీ ట్రయల్స్ అంటే కష్టమే!**

ఢిల్లీ: ఒలింపిక్స్ బరిలో నిలిచేందుకు గాను అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటి తమ 'బెర్తు'ను ఖాయం చేసుకున్నా రెజ్లర్లు మాత్రం తాము 'పారిస్'కు వెళ్తామా..? లేదా..? అన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటి వరకూ వేర్వేరు విభాగాల్లో ఐదు బెర్తులు మాత్రమే ఖాయమైనా.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) తీరుతో కోటాను ఖాయం చేసుకున్న రెజ్లర్లూ ఆందోళనకు గురవుతున్నారు. డబ్ల్యూఎఫ్ఐ మళ్లీ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తానని చెప్పడం గందరగోళానికి దారితీస్తోంది. డబ్ల్యూఎఫ్ఐ తీరు వల్ల మెగా టోర్నీ ముంగిట తమకు మనశ్శాంతి కరువైందని వాళ్లు వాపోతున్నారు. భారత్‌కు తొలి బెర్తును అందించిన అన్షు మాలిక్ (57 కిలోలు) మాట్లాడుతూ.. 'ఇటీవల కాలంలో నేను ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నాను. నా ఫిట్‌నెస్‌ను కొత్తగా నిరూపించుకునేదేమీ లేదు. ఒలింపిక్స్ ముందు మాకు మానసిక ప్రశాంతత కావాలి. ఈ స్థితిలో ప్రతి రోజూ మాకు కీలకమే. నేను జూన్ 10 నుంచి ఇంటర్నేషనల్ ట్రైనింగ్ క్యాంప్ కోసం యూరప్ వెళ్లాల్సి ఉన్నా డబ్ల్యూఎఫ్ఐ ట్రయల్స్ కారణంగా దానిపై తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నా' అని ఆవేదన వ్యక్తం చేసింది. మరో రెజ్లర్, 68 కిలోల విభాగంలో బెర్తును దక్కించుకున్న నిషా దహియా స్పందిస్తూ.. 'క్వాలిఫయర్స్ కోసం నేను బరువు తగ్గి గాయాలతో ఇప్పుడిప్పుడే రికవరీ అవుతున్నా. ఇప్పుడు మళ్లీ ట్రయల్స్ అంటే అది నా శరీరం మీద తీవ్ర ప్రభావం చూపుతుంది' అని తెలిపింది. రెజ్లింగ్ సెలక్షన్ ట్రయల్స్‌పై డబ్ల్యూఎఫ్ఐ ఈనెల 21న ఢిల్లీలో సమావేశమవనుంది.

## వాణిజ్య



### బ్లాక్ ఎడిషన్‌గా అపాచీ

**ప్రారంభ ధర రూ.1.09 లక్షలు**

చెన్నై, మే 17: దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన అపాచీ 160 ఆర్‌టీఆర్‌ను బ్లాక్ ఎడిషన్‌గా మళ్లీ విడుదల చేసింది టీవీఎస్ మోటర్ సంస్థ. నూతన శ్రేణి టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160 సిరీస్‌ని రూ.1,09, 990 విక్రయించనున్న సంస్థ..అపాచీ ఆర్‌టీఆర్ 160 4 వాల్వ్‌ ధరను రూ.1,19,990గా నిర్ణయించింది. గత నాలుగు దశాబ్దాలుగా స్పోర్ట్స్ బైకు విభాగంలో అగ్రగామిలో దూసుకుపోతున్న అపాచీ.. అంతర్జాతీయంగా ఇప్పటి వరకు 55 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం ఇదే బైకును బ్లాక్ ఎడిషన్‌గా మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

dishtv SMART+

### డిష్ టీవీ స్మార్ట్ సేవలు

హైదరాబాద్, మే 17: ఓటీటీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని డిష్ టీవీ సరికొత్తగా 'డిష్ టీవీ స్మార్+' సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒకే ప్లాన్ కింద ఓటీటీ, టీవీ చానెళ్లను ఎక్కడైన, ఎప్పుడైన తిలకించవచ్చునని పేర్కొంది. ఓటీటీ సేవలతోపాటు టీవీ సబ్‌స్క్రిప్షన్ సేవలు అందించడం ఇది తొలిసారి కావడం విశేషం. ప్రస్తుతం మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఓటీటీ యాప్‌లను ఎంచుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఇందుకోసం అదనంగా చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని సంస్థ స్పష్టంచేసింది. ఈ ప్లాన్‌లో భాగంగా సెట్-టాప్ బ్యాక్స్, స్మార్ట్ ఆండ్రాయిడ్ ఎస్‌టీబీతో ఈ సేవలు పొందవచ్చునని తెలిపింది.

# అప్పులో 73% గల్లంతే

## దివాలా కేసుల్లో నిండా మునుగుతున్న బ్యాంకులు

**లిటిగేషన్లతో పెరుగుతున్న పరిష్కార సమయం -ఇక్రా తాజా రిపోర్టులో వెల్లడి**

ముంబై, మే 17: సచ్చినోడి పెండ్లికి వచ్చిందే కట్నం అన్నట్టు తయారైంది దివాలా తీర్మాన కేసుల్లో బ్యాంకుల పరిస్థితి. ఇచ్చిన అప్పులు ఎంతకీ వసూలు కాకపోతుండటంతో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయిస్తున్న రుణదాతలకు దక్కుతున్నది అంతంతే మరి. దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా శుక్రవారం విడుదల చేసిన ఓ నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2023-24) దివాలా ప్రక్రియ కేసుల్లో రుణదాతలు తామిచ్చిన అప్పులో ఏకంగా 73 శాతాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)లోనూ ఇది 64 శాతంగా ఉండగా.. గత ఆర్థిక సంవత్సరం ఇంకా పెరుగడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) కూడా బ్యాంకుల రుణ రికవరీ సగటు 30-35 శాతం శ్రేణిలోనే ఉండవచ్చని ఇక్రా అంచనా వేస్తున్నది.

**ఆందోళనకరం**

బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల మొండి బకాయి (నిరర్థక ఆస్తి లేదా ఎన్‌పీఏ)ల్లో ఎక్కువ శాతం కార్పొరేట్ రుణాలే ఉన్న విషయం తెలిసిందే. అయితే మొత్తం బకాయిల్లో మిగతా రుణాల కంటే ఈ కార్పొరేట్ రుణాల్లోనే బ్యాంకులుగానీ, ఇతర రుణదాతలుగానీ ఎక్కువగా నష్టపోవాల్సి వస్తున్నదని ఇక్రా చెప్తున్నది. ఇది ఆందోళనకర స్థాయిలోనే ఉంటుందని కూడా హెచ్చరించింది. ఇక ఎన్‌పీఏలను అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ)లకు చాలా అగ్గువకే బ్యాంకులు అమ్ముకుంటున్నాయని కూడా ఆర్థిక నిపుణులు అంటున్నారు. దీనివల్ల పెద్ద ఎత్తునే నష్టాలు వస్తున్నాయని ఇక్రా సైతం పేర్కొంటున్నది.





**చిక్కులతో..**

దివాలా కేసుల్లో బ్యాంకర్లు అనేక రకాల లిటిగేషన్లను ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఇక్రా నిర్మాణాత్మక ఫైనాన్స్ రేటింగ్స్ విభాగాధిపతి అభిషేక్ దఫ్రియా అంటున్నారు. అంతకుముందుతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం దివాలా తీర్మాన ప్రక్రియకు పట్టే సమయం పెరిగిందని, 834 రోజులవుతున్నదన్నారు. ఇది కూడా మొండి బకాయిల్లో ఎక్కువ మొత్తాన్ని రుణదాతలు వదులుకునేందుకు కారణమవుతున్నదనీ చెప్తున్నారు. నిజానికి 330 రోజుల్లోనే రిజల్యూషన్ పూర్తవ్వాలని చట్టాల్లో (ఐబీసీ) ఉందని ఆయన గుర్తుచేస్తున్నారు. ఇదిలావుంటే ఈ ఏడాది మార్చి ఆఖరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన రిజల్యూషన్ ప్లాన్లు మొత్తం 269గా ఉన్నాయి. ఏడాది కిందట 189 ఆమోదం పొందాయి. కాగా, 2023-24లో ఎన్‌సీఎల్‌టీకి వచ్చిన కొత్త కేసులు 987కు తగ్గాయి. 2022-23లో 1,263గా ఉన్నాయి. అయితే కరోనా ప్రభావం వల్లే నాడు ఎక్కువ కేసులు వచ్చినట్టు ఇక్రా చెప్తున్నది.

**ప్రైవేటీకరణపై మాట్లాడలేం: జోషి**

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం లేదా ప్రైవేటీకరణపై మాట్లాడలేమని ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషీ అన్నారు. సర్కారీ బ్యాంకుల ఏకీకరణ, అమ్మకాలపై మాట్లాడే సమయం ఇది కాదని శుక్రవారం అడిగిన ఓ ప్రశ్నకుగాను ఆయన సమాధానమిచ్చారు. ఇక మోదీ హయాంలో రెండుసార్లు ప్రభుత్వ బ్యాంకుల విలీనం జరిగిన సంగతి విదితమే. 2020 ఏప్రిల్ 1న జరిగిన మెగా విలీనంలోనైతే ఏకంగా 10 బ్యాంకులు.. 4 బ్యాంకులుగా మారిపోయాయి. పీఎన్‌బీలో ఓరియంటల్, యునైటెడ్ బ్యాంక్‌లు కలిసిపోగా, కెనరా బ్యాంక్‌లో సిండికేట్ బ్యాంక్ విలీనమైంది. యూనియన్ బ్యాంక్‌లో ఆంధ్రా, కార్పొరేషన్ బ్యాంకులు కలిసిపోయాయి. ఇండియన్ బ్యాంక్‌తో అలహాబాద్ బ్యాంక్ విలీనం జరిగింది. ఇక 2019 ఏప్రిల్ 1న బీవోబీలో విజయా, దేనా బ్యాంక్‌లు విలీనమైనది తెలిసిందే.



# లీజుకు కియా.. నెలకు రూ.21,900తో

**హైదరాబాద్‌తోపాటు మరికొన్ని నగరాల్లో అందుబాటులోకి**

న్యూఢిల్లీ, మే 17: 'కియా లీజ్' పేరుతో ఓ కొత్త కార్యక్రమానికి కియా శ్రీకారం చుట్టింది. ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో ఈ లీజింగ్‌ను కియా పరిచయం చేసింది. తొలి దశ కింద హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పుణె నగరాల్లో లీజుకు కియా కార్లు అందుబాటులో ఉండనున్నాయి. లీజు కాలం పూర్తయిన తర్వాత వాహనాన్ని తిరిగి ఇచ్చేయవచ్చు. అవసరాన్ని, ప్రాధాన్యతలను బట్టి మరో కొత్త మాడల్ కారును మళ్లీ లీజుకు తీసుకోవచ్చు. 'లీజింగ్ మాడల్.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతున్నది. భారత్‌లోనూ దీనికి విశేష ఆదరణ లభిస్తున్నది. అందుకే 'కియా లీజ్'ను తీసుకొచ్చాం. దీనివల్ల మా కస్టమర్లు మున్ముందు ఇంకా పెరుగుతారు' అని ఈ సందర్భంగా కియా ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ మైయుంగ్-సిక్ సోన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**'కియా లీజ్' విశేషాలు**

- మెయింటెనెన్స్, బీమా, రీసేల్ వంటి ఇబ్బందులు లేకుండా కార్ ఓనర్‌షిప్ అనుభవాన్ని కస్టమర్లు పొందవచ్చు.
- వివిధ మైలేజీ ఆప్షన్లతో 24 నుంచి 60 నెలలపాటు కార్లను లీజుకు తీసుకోవచ్చు.
- ఎలాంటి డౌన్‌పేమెంట్లూ అవసరం లేదు.
- కియా కార్ల కనీస నెలవారీ లీజు ధరలు ఇలా ఉన్నాయి.

**సోనెట్-రూ.21,900, కారెన్స్-రూ. 28, 800, సెల్టోస్-రూ.28,900**

# ఎయిర్ ట్యాక్సీ సేవల్లోకి డ్రోగో!

హైదరాబాద్, మే 17: ఎయిర్ ట్యాక్సీతో పాటు అత్యవసర వైద్య సేవలు అందించడానికి ప్రణాళికలకు రూపొందిస్తున్నట్లు డ్రోగో డ్రోన్స్ సీఈవో యశ్వంత్ బొంతు తెలిపారు. దేశవ్యాప్తంగా 30 లక్షల ఎకరాల్లో క్రిమి సంహారక మందులు పిచికారీకి ఇఫ్కోతో ఒప్పందం చేసుకోవడంతోపాటు వ్యవసాయ రంగంలో విస్తృతమైన సేవలు అందించే కృషీ 3 డ్రోన్‌కు పౌర విమానయాన సంస్థ డైరెక్టర్ ఆఫ్ జనరల్(డీజీసీఏ) అనుమతిచ్చిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ..సర్వే, మ్యాపింగ్, ఉత్పత్తుల రవాణా మరికొన్ని ఇతర రంగాలకు డ్రోన్స్ సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. కృషీ 3 డ్రోన్ ఒకసారి చార్జింగ్ చేస్తే నాలుగు ఎకరాల్లో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయనున్నది.

# 89 వేలు దాటిన వెండి

న్యూఢిల్లీ, మే 17: వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. వరుసగా రెండోరోజు శుక్రవారం కిలో వెండి ధర ఏకంగా రూ.89 వేల మార్క్‌ను అధిగమించింది. బంగారం ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ వెండి మాత్రం పరుగులు పెడుతున్నది. రికార్డు స్థాయికి చేరుకున్న ధరలు పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు గగ్గోలు పెడుతున్నారు. వరుసగా రెండు రోజుల్లో వెండి ఏకంగా రూ.2 వేలకు పైగా ఎబాకింది. శుక్రవారం మరో రూ.300 అందుకొని రూ.89 వేలకు చేరుకున్నది. అటు బంగారం రూ. 150 తగ్గి రూ.74 వేల దిగువకు రూ. 73, 900కి పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,380 డాలర్లకు పడిపోగా, వెండి 29.65 డాలర్లకు ఎగబాకింది.

# వరుసగా రెండోరోజు లాభాలు

ముంబై, మే 17: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిశాయి. మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 253.31 పాయింట్లు ఎగబాకి 73,917.03 వద్ద ముగియగా, ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 62.25 పాయింట్లు అందుకొని 22,466.10 వద్ద స్థిరపడింది. మరోవైపు శనివారం దేశీయ స్టాక్ మార్కెట్లు తెరిచివుంచనున్నాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సైట్‌లో ఎదురయ్యే అంతరాయాలను నియంత్రించడానికి రెండు సెషన్లలో జరగనున్న ట్రేడింగ్‌లలో తొలి విడుత ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు, రెండో విడుత ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపింది.

# మోసగాళ్లతో జీఎస్టీ అధికారుల కుమ్మక్కు

**బోగస్ కంపెనీల ఖాతాల్లో నిమిషాల్లో కోట్లాది రూపాయలు జమ**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ కార్యాలయాలు అంటే సామాన్యులు జంకుతున్నారు. ఏదైనా పని కోసం దరఖాస్తు చేస్తే రోజులు..నెలల తరబడి పెండింగ్‌లో పెట్టి చివరకు కొర్రీలు పెట్టి ఈ పనికాదని ఖరాకండిగా చెబుతున్నారు. ఇది సాధారణంగా ప్రభుత్వ అధికారులు తీరు ఇలాగా ఉంటుంది..కానీ కొందరు మాత్రం దరఖాస్తుదారుల నుంచి ఆమ్యామ్యాలు స్వీకరించి ఎంతటి పనినైనా క్షణాల్లో చేసిపెడుతున్నారు. ఇది ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే తంతు కానీ, జీఎస్టీ కార్యాలయాల్లో కూడా ఇదే సీన్ రిపీటైంది. అక్రమ పద్దతిలో జీఎస్టీ రిఫండ్‌ను కొట్టేయాలనే ఉద్దేశంతో వ్యాపారి ఆడిన నాటకం బట్టబయలు అయింది. జీఎస్టీ రిఫండ్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్న నిమిషంలోనే బ్యాంక్ ఖాతాలో రూ.2 కోట్లు డిపాజిట్ కాగా, మరో పది నిమిషాల్లో మరో రూ.3 కోట్లు జమయ్యాయి. జీఎస్టీ రిఫండ్‌కు సంబంధించిన కుంభకోణం బయటకు తేవడంలో ఈ లావాదేవీలే కీలకంగా మారాయి.

**ఢిల్లీ ట్యాక్స్ కన్సల్టెంట్‌కు లింకు..**

విద్యుత్‌తో నడిచే ద్విచక్ర వాహనాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను ఆసరాగా చేసుకొని ఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మను అడ్డంగా పెట్టుకొని అటు వ్యాపారులు, ఇటు జీఎస్టీ ఉన్నతాధికారులు కోట్ల రూపాయల రిఫండ్ కుంభకోణానికి పాల్పడ్డారు. మెడికల్ వ్యాపారం నిర్వహిస్తున్న రమేశ్ రెడ్డికి సంబంధించిన ఈ-బైక్‌ల తయారీ సంస్థకు రావాల్సిన రూ.5 కోట్ల జీఎస్టీ రిఫండ్ నిలిచిపోయింది. ఈ రిఫండ్ కోసం రంగంలోకి దిగిన చిరాగ్ శర్మ..జీఎస్టీ ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చి వెంటనే విడుదల చేయించారు. ఇక్కడే అధికారులకు, చిరాగ్ శర్మకు మధ్య మనీ బంధం ఏర్పడింది. ఇటీవల అరెస్టైన అధికారులతో చేతులు కలిపిన చిరాగ్ శర్మ.. జీఎస్టీ రిఫండ్‌తోపాటు కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్, జీఎస్టీ నంబర్లు, ఫైలింగ్ చేయిస్తూ తమ అక్రమ దందాను కొనసాగించారు. ఈ క్రమంలో తమ అక్రమ దందాకు అడ్డువచ్చిన అధికారులను సైతం బెదిరించడానికి సైతం వెనుకాడలేదు. హైదరాబాద్‌లో రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న నకిలీ ఈ-బైకుల తయారీదారుడికి మాత్రం రిఫండ్‌కు సంబంధించిన దాంట్లో ఎదురుదెబ్బ తగిలింది. దీనిపై రంగంలోకి దిగిన చిరాగ్ శర్మ రంగంలోకి జీఎస్టీ ఉన్నతాధికారితో మాట్లాడిన పని కాలేదు.ఈ ఫైల్‌ను వెంటనే తనకు నమ్మిన అధికారి విధులు నిర్వహిస్తున్న నల్గొండకు బదిలీ చేయించుకున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే తిరిగి ఆ ఫైల్స్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో అనుమానం వచ్చిన జీఎస్టీ అధికారి ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు.





Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.